# అక్కరకు రాని చుట్టాలు

నిడదవోలు సీతారామారావు

చుట్టాలు సమయానికి ఎందుకు అక్కరకు రారో సత్యానికి అర్థం కాలేదు. కావడం లేదు. నిజానికి, చేతనయిన సాయం చేస్తే, వాళ్ళ సొమ్మేం తరిగిపోతుందా? కొంప కూలి పోతుందా? పుట్టి మునిగిపోతుందా? అదే అతనికి తెలియటంలేదు.

కృష్ణకి మొన్న నింతేకదూ జరిగింది? అవసరం కొద్దీ ఓ పది రూపాయలు ఇమ్మని వెళితే, ఆఖరికి పెత్తండ్రే లేదు పొమ్మన్నాడు! ఆయన దగ్గిరప్పుడు డబ్బులేదట. కృష్ణమూర్తి తీర్చలేనివాడే అనుకోండి. అయితే ఏం? పైవాడా? ఆమాత్రం తినరానివాడా? ఆలోచిస్తే కృష్ణ అడిగింది అతని సిగరెట్టు ఖర్చు పాటి కాదు! అంతెందుకూ, తనకిమాత్రం? "ఈ ఒక్క రోజుకి నీ వాచీ యియ్యిబాబూ! ఎంతైనా పుణ్యముంటుంది. ఈవాళ మీటింగులో అధ్యక్షత వహించాలికదా, ఆమాత్రం లేకపోతే ఎలా సీనూ? దేశంలోవున్న ఈ అవినీతిని నిర్మూలించడానికి, ఆ ఉపన్యాసాలయినా యిచ్చి సాయం చేయవద్దంటావా మరి?" అని తనెన్ని విధాల బతిమాలలేదు? వాచీ వెంటనే యిప్పిస్తానని ఎన్నిసార్లు చెప్పలేదు? ఎంతగా నచ్చచెప్పేడు? అయితేనేం, అంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది. "మజ్జిగ నీళ్లుంటే, ఇలా కొంచెం పొయ్యండి పిన్నిగారూ! మా పెరుగు మనిషేమో ఎగనామం పెట్టిందివాళ. పోనీ ఈ ఒక్క రోజు ఎలాగో సరిపెట్టుకుండా మనుకుంటూంటే, పెద్దల్లుడుగారొచ్చేరు" అని తన భార్య పుల్లమ్మత్తయ్య ఇంటికి తీరా వెళ్ళి అడిగితే, ఏమంది? "అయ్యో రామా అమాయదారి పాపిష్టి పిల్లి ఏదీ వుండనిస్తేనా? మీ ఇంటికే వద్దామనుకుంటూంటే, నువ్వే వచ్చేవూ? మరీ బాగుంది!" అని బోసి పళ్లు ఇలికించేసింది? ఎవరేనా అడిగే సరికల్లా, ఆ మాయదారి పాపిష్టి పిల్లులు వస్తాయి కాబోలు. ముందరి రోజు తన ఇంట్లో కాఫీ తాగిన పుల్లమ్మత్తయ్యేనా ఆవిడ? ఆ కాఫీ దండుగే నన్నమాట!

అయితేమాత్రం? కొంతమంది తనకి సాయం చేసినవాళ్ళూ వున్నారు. అందునుంచి ఒక నిశ్చయానికి రాలేకపోయాడు సత్యం.

తనుమాత్రం, మరొకళ్ళకి చుట్టం కాడా? బంధువు కాడా? అవును నిజమే! అయితేనేం? తనలాంటివాడు కాడు. తక్కినవాళ్ళల్లాగ తన గొప్పతనాలన్నీ తను చెప్పుకుకోడు కాని, యెంతమందికి సాయం చేయలేదుతను? లెఖ్ఖలేదు.

ఆవేళ గబగబా దైన్యంగా సీను వచ్చేడు. వచ్చీ రావడంతోనే "ఈవాళ జీతం కట్టకపోతే ఫైన్ వేస్తారు మావయ్యా! దగ్గిరేమో చూడబోతే దమ్మిడీ లేదు. నాన్నాగారంటారా? ఎందుకో ఇంకా పంపలేదు మరి!" అని అడిగేడు. వెంటనే సందేహించకుండా డబ్బిచ్చేడు. అంతేనా? "ఎందుకు పంపలేదో కనుక్కుంటానుండని" ఆవేళే భాస్కరానికి, వెంటనే డబ్బుపంపించమని వుత్తరం రాసేడు.

"పెళ్ళివారొస్తున్నారవతల. కాలక్షేపానికి వుంటుంది, నీ గ్రామఫోనియ్యి సత్యం" అని కృష్ణ అడిగితే కాదన లేదు. ఎదురు కూడా చెప్పకుండా యిచ్చేడు. కాఫీ పొడరే కానియ్యండి, పంచదారే కానియ్యండి, పెరుగే అవనీండి, పాలే అవనీండి, పుల్లమ్మత్తయ్య కెన్ని మాట్లు సరఫరా చేయలేదు. ఇలాగెన్ని సార్లు ఎంతమందికని సాయం చేయలేదు? ఇందులో అతిశయోక్తేం లేదు. అంతా అక్షరాలా నిజం. శుద్ధ ఖద్దర్లోనే అబద్ధమాడడం! మూడు రంగుల జెండానీడని మెలుగుతూనే అసత్యం పలకడం! గాంధీటోపీ కిందనున్న బుఱ్ఱలోనే అలాంటి ఆలోచనలు!


గ్రామబంధు మొదలయిన బిరుదుల చేపట్టిన తనుచుట్టాలకు కానివాడనడం, అర్థంపర్థం లేని

విషయం. తనేం సహాయం చెయ్యలేదని, లోభి, బ్లాకు మార్కెటు మొదలయిన వాట్లలో పేరుపొందిన గురవయ్యకు కుడిభుజంగా వున్నాడని, ఇంకా యేవో అంటారేకాని, వాళ్ళకేం తెలుసు తన విషయం? తనది నిరాడంబర జీవితంకాని, పిసినిగొట్టుదేం కాదు. గురవయ్యా మాటంటే? అందులో తప్పేముంది? మంచి నమ్మకస్తుడే? అయినా తనకెందుకా సంగతులన్నీ ప్రస్తుతం?

ఏదెలావున్నా భాస్కర్రావు మాత్రం తక్కిన వాళ్ళలాంటివాడు కాడు. మంచి స్థితిలో వున్నాడు. మొదటి తరగతిలో పాసయితే, మేనల్లుడిని తనకింది ఆఫీసర్ని చేస్తానని మొదటినుంచీ చెప్తానే వున్నాడు. తన కొడుకేమో, మొదటి తరగతేం విటి; యూనివర్సిటీ ఫస్టుగా పాసయితే! అయితేనేం? అక్టోబర్లో కాని, ఆ పని ఖాళీ అవదట. మరలాంటప్పుడు గోళ్ళూ గిల్లుకుంటూ కూచోడమెందుకని వూళ్ళోనే తనతోపాటు లెక్చరర్ గా చేస్తున్నాడు.

వెదుకబోయిన కాలికి తగిలినట్లు, జోళ్లు తొడిగిన సత్యానికి, వారంరోజులనుంచీ ఊళ్లోనే వుంటూన్న భాస్కరం ద్వారందగ్గిరే ఎదురయ్యేడు. ఏరోజు కారోజు, భాస్కర్రావే వస్తాడులే అని సత్యం ఇన్నాళ్లు కదలలేదు. తీరా తెగితెంపులు చేసేసరికి, అతనే యెదురయేడు. భాస్కరంకూడా ఆఫీసు పనులవల్ల యీ వారంరోజులు రాలేకపోయాడు.

“అయితే అబ్బాయిని ఈపనికి ఎప్పుడురిజైన్ యిమ్మంటావు తమ్ముడూ! అందుకనే బయలుదేరేరాయన మరీను” అని సత్యం భార్య అడిగింది. వెంటనే భాస్కరం అందుకొన్నాడు. “సరిసరి! ఇది మరీ బాగుంది. మీకా క్కావలసింది అబ్బాయి వుద్యోగమే కాని, నేను కాదన్నమాట ఇంతకీను. ఇంక వెళ్లొస్తా మరి. ఇరవయ్యకల్లా రిలీవయేటట్టు చూడమనండి మరి” అంటూనే భాస్కరం కుర్చీలోంచి లేచాడు. “భలేవాడివే” అంటూ మళ్ళీ కూచోబెట్టి అంతా



కేంద్ర మంత్రి పదవి విరమించి శ్రీ రాజగోపాలాచారిగారు గతవారం మద్రాసు వచ్చినప్పుడు గవర్నరు మొదలైనవారు ఆయనకు విమానాశ్రయం వద్ద స్వాగతమిస్తున్న దృశ్యం.

కలిసి కొంచెంసేపు నవ్వుకున్నారు.

హఠాత్తుగా సత్యానికేదో జ్ఞాపకంవచ్చింది. "అదేమిటి భాస్కర్! మీసీనలా చేసేరు. మొన్న జబ్బుపడ్డాడే అనుకో. సెప్టెంబర్లో కూడా తగలేసేదేమిటి మరి? ఒకటా, రెండా అయిదు మార్కులు తక్కువ వచ్చాయి" అన్నాడు సత్యం. భాస్కర్ తలవూపి, "ఆవేళ జ్వరం వచ్చిందట. అసలే బావుల్లేదట ఆవేళ. ఇంకా యేవేవో యిలాగ చెప్పొచ్చేడన్నీను. ఏంచేస్తాం. అందుకే, అది కనుక్కుందామనే వచ్చాను" అని టూకీగా అసలు విషయం బైటపెట్టాడు. "అరే ఇంతకీ మాకోసం కానే కాదన్న మాట." అని వెంటనే సత్యం తిప్పికొట్టాడు. విరగబడి. నవ్వుకున్నారు కొంతసేపు అంతాను.

పక్కింటి వాళ్ళ రేడియో బండగొంతుకతో యేదో తెగ వాగేస్తున్నది. అంతా ప్రేమ జగత్తును గురుంచిలాగుంది. "ప్రేమజగత్తులో ప్రేమకి అర్థం డబ్బుడబ్బు డబ్బు. ధనహీనుడుకి ప్రేమికులుండురు. అంటే మరోలా చెప్పాలంటే చుట్టాలుండురు" ఇలాగే వుంది వుపన్యాసమంతాను. భాస్కరం వేపు జూసి మందహాసం చేశాడు సత్యం.

రేడియో గొంతు వినగానే. చిట్టి ఎప్పటిలాగే వెంటనే రేడియో కొనమన్ని మారాం చేయడం మొదలుపెట్టింది. నిలుచున్నపాటున కొనిమ్మని రాగం తీసింది. నయాన్ని భయాన్ని చెప్పి చూశారు. కాని రాగం స్థాయి తగ్గలేదు. "అబ్బబ్బ? ఏంపిల్లలో నబ్బా! కొంటానుండవే అంటే ఏవిటా గోల?" అని కోపంతో అరిచేడు తండ్రి. కూతురు మాత్రం తన "ఫ్రీ" పాటను ఆపలేదు.

"ఎందుకు బావా చిట్టి ననవసరంగా అలా గంటావ్? ఆమాత్రం చేతకాకపోతేసరి! ఇలా రా చిట్టి మనం బజారుకుపోయి తెచ్చుకుందాం. ఊఁ పద" అని చిట్టిని చేరదీసి, బుజ్జగిస్తూ బజారుకు తీసుకొని వెళ్ళేడు. సత్యం పెదవి కదపలేదు.

గంటలో నాలుగు వందల ఖరీదు చేసే రేడియో ఇంట్లోవుంది. మొదట కొంచెం విసుక్కున్నాడు. తరవాత అయిదు వందలయినా లేందీ రేడియో ఏవిటన్నాడు. ఆ రేడియో ఖరీదిచ్చేస్తానన్నాడు. కాని భాస్కరం పుచ్చుకోలేదు. కొంతసేపు పాట విన్న తర్వాత, భాస్కరం వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ తను కొడుకు విషయం మర్చిపోవద్దన్నాడు. ఆ విషయంలో బెంగవద్దని, తప్పకుండా "ఆనాలుగు" మార్కులు వేస్తానని సత్యం వాగ్దానం చేసేడు.

ఘటనా చక్రం గిరగిరా తిరిగింది. రానే వచ్చింది ఇరవయ్యో తారీకు.

కొడుకు ఉద్యోగం ఆర్డర్ కోసం, ఏరోజు కారోజు సత్యం యెదురు తెన్నులు చూస్తున్నాడు. పోస్టుమాన్ వుత్తరం అందివ్వగానే వుప్పొంగిపోయాడు. విప్పిన తరవాత ఆశ్చర్యపోయేడు. చదివిన తరవాత నిలువునా నీరైపోయేడు. పై ఆఫీసర్ అల్లుడికి ఆ ఉద్యోగం యిచ్చేరుట. మొదటినుంచి మూడవ తరగతి వాడయినా, ఒక డిగ్రీ యెక్కువ వుందిట! అంగుసుంచి ఇవ్వక తప్పలేదట. కొన్నాళ్లు మిలిటరీలో కూడా పనిజేసి వచ్చేడట. శాయశక్తులా ప్రయత్నించేనని, అంతా బూడిదలో పోసిన పన్నీరయిందని భాస్కరం వాపోయేడు. తన చేతుల్లోంచి దాటింది కనుకనే అలా జరిగిందని, క్షమించమని రాశేడు. సీనుకు ఆ నాల్గు మార్కులు వేసినందుకు కృతజ్ఞత తెలిపేడు.

వీథిలోంచి వస్తున్న సత్యం కొడుకు, తండ్రికి పేపరందిస్తూ, విచారంతో అన్నాడు "పాపం సీను పరీక్ష పోయిందండీ!" అని. తండ్రి చేతిలో వుత్తరం చూసి తన వుద్యోగ విషయమేనన్న వుద్దేశ్యంతో, సంతోషంతో చెప్పేడు, తన నీవేళ రిలీజు చేసినట్టు.

అప్రయత్నంగా సత్యం నోరువెమ్మట "అక్కరకు రాని చుట్టాల"న్న మాటలు వినపడ్డాయి. పళ్లు పటపటలాడేయి.

"ధనమూలమిదమ్ జగత్" అంటున్న రేడియో నోటిని మూయడానికి ఆతృతతో వెళ్లేడు సత్యం.

చుట్టాలు సమయానికి ఎందుకు అక్కరకు రారో సత్యానికి అర్థంకాలేదు. కావడంలేదు. చేతనయిన సాయంచేస్తే, వాళ్ళ సొమ్మేం తరిగిపోతుందా? కొంప కూలిపోతుందా? పుట్టి మునిగిపోతుందా? అదే అతనికి తెలియడంలేదు.